హ్యూమన్ రైట్స్ ఆక్టివిస్ట్ దీపక్‌శర్మకు డాక్టరేట్



నల్లకుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘసేవకులు, హ్యూమన్ రైట్స్ ఆక్టివిస్ట్ దీపక్‌శర్మ చేస్తున్న సేవలను న్యూఢిల్లీకి చెందిన ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ గుర్తించింది. ఈ మేరకు ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగరానికి చెందిన దీపక్‌శర్మకు డాక్టరేట్ ప్రదానం చేశారు. తెలుగు రాష్ట్రాలలో 15 ఏళ్లుగా దీపక్‌శర్మ సొంత ఖర్చులతో పేదవారికి మేలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దీపక్‌శర్మ మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ ఆక్టివిస్ట్‌గా పౌర సమాజానికి తనవంతు కృషి చేస్తున్నానన్నారు. ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



కవాడిగూడ చిత్రాలనగర్‌లో డ్రైనేజీలను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు ఆధునికీకరించాలి : సీపీఎం

కవాడిగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ చిత్రాలనగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్లను వెంటనే ఆధునికీకరించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. చిత్రాలనగర్‌లో బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పాదయాత్ర చేసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గసభ్యులు ఎం.దశరథ్ మాట్లాడుతూ, చిత్రాలనగర్‌లో 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌లను ఆధునికీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్ వెంకటేష్, కార్యదర్శి వర్గసభ్యులు పి.విమల, బాబు, రమేష్, మహేందర్, జోన్ కమిటీ సభ్యులు లెనిన్, నాయకులు చారి, రేజా, బాలమణి, మల్లయ్య, కోటి, లక్ష్మి, తోపాటు బస్తీ వాసులు పాల్గొన్నారు

ఆ ఉత్సవ కమిటీని వ్యతిరేకిస్తున్నాం : డీబీపీ

కవాడిగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని, బాబుజగ్జీవన్‌రాం జయంతితోపాటు కలిపి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే ఉత్సవాలను బాబు జగ్జీవన్‌రాంతో కలిపి నిర్వహించే ప్రయత్నం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఆయన జయంతిని ఏప్రిల్ 14న ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా పాటిస్తూ 193 దేశాల పిలుపునిస్తుంటే తెలంగాణలో మాత్రం ఆయన స్థాయిని తక్కువగా చూపే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రూ.500 కోట్లు, కేంద్రస్థాయిలో రూ.5వేల కోట్లు కేటాయించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. ఎంటహెచ్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని డీలక్స్ హోటల్, నూన్ ట్రావెల్స్, బడా మసీదు, అడ్వొకేట్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, ఏపీఎస్‌ఈబీ ఈప పరిధిలోని గోకుల్ టవర్స్, ఊర్వశి బార్, కుమ్మరి బస్తీ, దక్కన్ చాంబర్స్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12నుంచి 1గంట వరకు, జవహర్‌నగర్, జాఫర్‌అలీబాగ్‌లోని టీఆర్‌టీ క్వార్టర్స్, గణేశ్ టెంపుల్, ఆర్టీసీక్రాస్‌రోడ్స్, సప్తగిరి టాకీస్, హోటల్ ఇన్నర్ సర్కిల్, సాబు మోటార్స్, బాదం అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాల్లో 3నుంచి 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బీబీసీ పేదలకు వైద్య సహాయం అభినందనీయం



వార్షికోత్సవంలో పాల్గొన్న జడ్జి వీవీఎస్.రావు

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లోని వందకుపైగా పీడియాట్రిక్ ఆస్పత్రుల్లో మానియో బీబీసీ ఆస్పత్రి ఆరోగ్యశ్రీ సదుపాయాన్ని కలిగి ఉందని, దీని ద్వారా పేద ప్రజలకు వైద్య సహాయం అందించడం అభినందనీయమని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జడ్జి వీవీఎస్.రావు పేర్కొన్నారు. సోమవారం విద్యానగర్‌లోని సురభి గ్రాండ్ హోటల్‌లో నియో బీబీసీ ఆస్పత్రి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ వీవీఎస్.రావు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో వైద్య సహాయం పేద ప్రజలకు అందించడం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పీడియాట్రిక్ 25 మంది వైద్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీబీసీ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మంచుకొండ రంగయ్య, రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఏవై.చారి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం.అబ్రహం, బీబీసీ ఆస్పత్రి సభ్యులు డాక్టర్ బి.సురేష్, డాక్టర్ మహేందర్‌రెడ్డి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ నరేందర్‌రావు, డాక్టర్ ప్రభాకర్‌రావు, డాక్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

23 నుంచి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశరక్షణ కోసం కార్యక్రమాలు



మాట్లాడుతున్న డాక్టర్ దిడ్డి సుధాకర్ తదితరులు

కవాడిగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ రక్షణ కోసం ఈనెల 23 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు దేశవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ వెల్లడించారు. గుజరాత్‌లోని సూరత్‌నగరంలో ఐపీసో జాతీయ కార్యవర్గ సమావేశం డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన సోమవారం ముగిసింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాల నివారణకు ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రపంచ శాంతి సంఘం అధ్యక్షుడు పల్లబ్ సేన్‌గుప్తా, ఐపీసో జాతీయ ప్రధాన కార్యదర్శి హరిచంద్‌సింగ్‌తోపాటు కేరళ, పశ్చిమ బెంగాల్, పాండిచ్చేరి, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఢిల్లీ, తెలంగాణ, గుజరాత్, రాజస్థాన్ నుంచి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'మారుతీనగర్' అధ్యక్షుడిగా సురేష్ గౌడ్

గోల్నాక, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ మారుతీనగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎ.సురేష్‌గౌడ్‌ను బస్తీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో సురేష్‌గౌడ్‌ను బస్తీ పెద్దలు, ప్రముఖులు శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, కొమ్ము శ్రీనివాస్, మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి, రాజులు, మరేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

రూ.8 కోట్లకు పైగా బకాయి పడ్డ ఆర్టీసీ

ఆర్టీసీ ప్రధాన కార్యాలయం జీహెచ్‌ఎంసీకి రూ.8 కోట్లకు పైగా ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలు చెల్లించాలని జీహెచ్‌ఎంసీ అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈసారి ఎట్టి పరిస్థితుల్లో మొత్తం అమలు చేయాలని అధికారులు చర్యలు జరుపుతున్నారు.



జీహెచ్‌ఎంసీ భవనం

ఫిబ్రవరి నెలాఖారు వరకు రూ.29.55కోట్ల వసూలు

- చెల్లించని 22వేల మందికి నోటీసులు జారీ
- అధిక మొత్తంలో పెండింగ్స్ ఉన్న వారిపై దృష్టి
- మార్చి 31వ తేదీలోపు చెల్లించాలి
- ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో ఆస్తిపన్ను వసూలుకు సర్కిల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. సర్కిల్‌కు ఇచ్చిన ఆస్తి పన్ను టార్గెట్ రూ.142 కోట్లు వసూలు చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లక్ష్యసాధనలో ఫిబ్రవరి 28వ తేదీ వరకు రూ.29.55 కోట్లను వసూలు చేశారు. మిగిలిన టార్గెట్‌ను చేరుకోవడానికి బిల్లులు చెల్లించని దాదాపు 22,640 మంది ఇంటి యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీచేశారు. సర్కిల్ పరిధిలో మొత్తం 62,501 మంది భవన యజమానులు ఉండగా వాటిలో ఇప్పటి వరకు 39,861 మంది నుంచి ఆస్తిపన్ను వసూలు చేశారు. మిగిలిన వారి నుంచి రావాల్సిన ఆస్తి పన్ను వసూలే లక్ష్యంగా అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి బిల్లు చెల్లించాలని ఒత్తిడి పెంచారు. బిల్లు చెల్లించకపోతే ఆస్తులను సీజ్ చేస్తామని అధికారులు ఇంటి యజమానులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో ఇంటి యజమానులు ఆస్తిపన్ను చెల్లించేందుకు ముందుకు వస్తున్నట్లు సమాచారం.

పెండింగ్‌లో ఉన్న వ్యాపార సముదాయాలపై ఒత్తిడి

సర్కిల్ పరిధిలో దీర్ఘకాలంగా బిల్లులు చెల్లించకుండా రూ.5 లక్షల పైన ఉన్న టాక్స్‌దారుల నుంచి ఆస్తి పన్నులు వసూలు చేయడంపై దృష్టి సారించారు. ఇప్పటికే వారికి నోటీసులు కూడా జారీచేశారు. ప్రత్యేకంగా ఏఎంసీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృందాలు వారి వద్దకు వెళ్లి బకాయిలు ఎట్టిపరిస్థితుల్లో చెల్లించాలని లేనిపక్షంలో ఆస్తులు సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వరంగ సంస్థలు, పరిశ్రమల నుంచి రావాల్సిన బకాయిలను పెద్దమొత్తంలో వసూలు చేసి, టార్గెట్ పూర్తి చేయడానికి కృషిచేస్తున్నారు. ఇది ఎంత వరకు ఫలిస్తాయానేది చూడాల్సి ఉంది.

ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని ఇంటి యజమానులందరూ మార్చి 31వ తేదీ వరకు ఆస్తిపన్ను చెల్లించాలి. ఆస్తి పన్ను చెల్లించని వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. అందరూ సకాలంలో చెల్లించి అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను చెల్లించని వారు స్పందించకపోతే వారి ఆస్తులను సీజ్ చేస్తాం.

- రామానుజులరెడ్డి, డీఎంసీ, ముషీరాబాద్ సర్కిల్

ఆస్తిపన్ను వివాదాలు.. వేదిక ద్వారా పరిష్కారం

ఆస్తి పన్నుకు సంబంధించి కోర్టులో ఉన్న వివాదాలు, అధిక మొత్తంలో ఉన్న పెండింగ్ బకాయిదారుల సమస్యలు వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేయడానికి సర్కిల్ అధికారులు పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. ఈ వేదికలో వచ్చిన సమస్యలను యజమానులతో అధికారులు చర్చించి వన్ టైమ్ సెటిల్‌మెంట్‌కు చర్యలు తీసుకుంటున్నారు. దీనివల్ల వివాదాలు పరిష్కారమై జీహెచ్‌ఎంసీకి ఆదాయం వచ్చేలా చూస్తున్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే కాలేరు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

నల్లకుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని డీడీ కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డివిజన్‌లోని స్ట్రీట్ నెంబర్ 10, 11, 12 ప్రాంతాలలో పాదయాత్ర చేసి స్థానిక ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, జలమండలి డీజీఎం శ్రీవిష్ణువర్ధన్‌రావు, జీహెచ్‌ఎంసీ డీఈ ప్రశాంతి, ఎలక్ట్రికల్ ఏఈ సౌమ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, రమేష్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయాలి

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సోమసుందర్‌నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులకు వారంరోజుల్లో శంకుస్థాపన చేయకపోతే మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఇంటి ముందు కాలనీవాసులతో కలిసి ధర్నా చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హెచ్చరించారు. సోమవారం ఆయన సోమసుందర్‌నగర్‌లో పర్యటించి ఆ కాలనీలో అధ్వానంగా మారిన రోడ్డు సమస్యను పరిశీలించారు. స్థానిక మహిళలు, సీనియర్ సిటిజన్లు తమ కాలనీలో నిధులు మంజూరైన రోడ్డు వేయడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమసుందర్‌నగర్‌లో రోడ్డు పనులకు మాజీ ఎంపీ వీహెచ్ జనరల్ బడ్జెట్ నుంచి రూ.20 లక్షల నిధులను మంజూరు చేయించారని తెలిపారు. నిధులు మంజూరై నెలలు గడుస్తున్న ఆ పనుల శంకుస్థాపనకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ రావాలని ఆయన సమయం ఇచ్చినప్పుడు శంకుస్థాపన చేస్తామని వీహెచ్, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రోహిణ్‌రెడ్డి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు : ఎమ్మెల్యే గోపాల్



ఏక్ మినార్ వద్ద ముస్లింలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని ముషీరాబాద్ నియోజకవర్గంలోని 36 ప్రధాన మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసే విధంగా ప్రభుత్వ శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. సోమవారం ముషీరాబాద్‌లోని ఏక్‌మినార్ మసీదును సందర్శించి మసీదులో ప్రార్థనలు ముగించుకుని బయటకు వస్తున్నవారిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, షాహెద్, జాఫర్, జావిద్‌ఖాన్, పర్వేజ్, ఎయిర్‌టెల్ రాజు, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముషీరాబాద్ డివిజన్ జెమినీ కాలనీలోని సాయిబాబా దేవాలయం 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గోపాల్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, సీనియర్ నాయకులు నాగేష్ ముదిరాజ్, బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, సీనియర్ పూసగోరక్‌నాథ్, కాంగ్రెస్‌పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం బీ-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్, సీనియర్ నాయకుడు రమేష్ గౌడ్, లింగంగుప్తా తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత



సాయిరాం హైస్కూల్ నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి దోహదం చేస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం కవాడిగూడ బీమామైదాన్ సమీపంలో ఉన్న సాయిరాం హైస్కూల్ ఆవరణలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రెయిన్ హార్వెస్టింగ్, సేంద్రియ వ్యవసాయం, వేస్ట్‌వాటర్ మేనేజ్‌మెంట్, హార్ట్ బ్లడ్ పంపింగ్, ఫైర్‌సెన్సార్ తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ మాజీ సభ్యులు మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి హాజరై విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలను తిలకించారు. సాయిరాం హైస్కూల్‌లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థులు ప్రదర్శించిన అన్ని ఎగ్జిబిట్‌లను వారు తిలకించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, బీజేపీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, నగరనాయకులు ఎంసీ.మహేందర్, బీజేపీ డివిజన్ ప్రధానకార్యదర్శి ఎ.ప్రభాకర్ గంగపుత్ర, బీజేపీ నేతలు ఏనుగు వినయ్‌కుమార్ బొల్ల రమేష్, సాయిరాం హైస్కూల్ చైర్‌పర్సన్ కపాల ప్రమీల, సెక్రటరీ కపాల సిద్ధార్థ, ప్రిన్సిపాల్ రాజశేఖర్, కల్యాణ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, ఉచిత వైద్యం పేదలకు అందించాలి

హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



ఉచిత వైద్య శిబిరంలో పేదలకు మందులు పంపిణీ చేస్తున్న దత్తాత్రేయ, బండారు వైష్ణవ్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షురాలు విజయలక్ష్మి

కవాడిగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్య, ఉచిత వైద్యాన్ని పేదలకు అందించినప్పుడే సమాజం ఉన్నతస్థితి వైపు పయనిస్తుందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మురికివాడలు, బస్తీలలో నివాసం ఉంటున్న నిరుపేద ప్రజల సంక్షేమం కోసం స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని ఆయన సూచించారు. సోమవారం కవాడిగూడ డివిజన్‌లో రోటరీ కాలనీలో బండారు వైష్ణవ్ జయంతి సందర్భంగా బండారు వైష్ణవ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ ఉచిత వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, బండారు వైష్ణవ్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షురాలు బండారు విజయలక్ష్మి, కార్పొరేటర్లు జి.రచనశ్రీ, సుప్రియానవీన్‌గౌడ్, పావని వినయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ ఎం.రమేష్‌రాం, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, నగర నాయకులు మహేందర్‌బాబు, వినయ్‌కుమార్, బీజేపీ నేతలు ఎ.ప్రభాకర్ గంగపుత్ర, సురేష్‌ముదిరాజ్, బొల్ల రమేష్, రోటరీ కాలనీ బస్తీఅధ్యక్షుడు బండారు యాదగిరితో పాటు బస్తీ వాసులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

భోలక్‌పూర్ హౌస్ బస్తీ అధ్యక్షుడిగా శంకర్



ముషీరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ హౌస్ బస్తీ అధ్యక్షుడిగా కేఎం. శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను బస్తీ పెద్దలు సన్మానించారు. సోమవారం భోలక్‌పూర్‌లోని గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్‌లో జరిగిన భోలక్‌పూర్ హౌస్ బస్తీ కార్యవర్గ సమావేశంలో కేఎం.శంకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ హౌస్ బస్తీపెద్దలు రాముయాదవ్, సాయిబాబాగౌడ్, ఆనంద్‌రావు, నాగరాజు, విశ్వేశ్వర్, మణికంఠ, వినోద్, నందూయాదవ్, నవీన్, మహేష్, ప్రేమ్‌యాదవ్, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

వినికిడి సమస్య సకాలంలో గుర్తిస్తే పరిష్కారం

ముషీరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వినికిడి సమస్యను సకాలంలో గుర్తిస్తే పరిష్కరించవచ్చని భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా యూపీహెచ్‌సీలో వినికిడి లోపాలపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఏఎన్‌ఎం విజయకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కూల్చిన హోంఫుడ్ షాపు ప్రహరీ నిర్మాణం

ముషీరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ జీహెచ్‌ఎంసీ పార్కు సమీపంలో హోంఫుడ్ షాపును ఓ భవన్ నిర్వాహకులు అర్ధరాత్రి సమయంలో బుల్డోజర్‌తో కూల్చివేసిన విషయం విదితమే. సోమవారం బీజేపీ నాయకులు నవీన్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు శివముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు జనిగె శ్రీనివాస్‌యాదవ్ తదితరులు షాపు యజమాని రాకేష్‌గౌడ్‌తో కలిసి భవన నిర్వాహకులతో మాట్లాడారు. దీంతో వారు కూల్చిన గోడ పునర్ నిర్మాణానికి అంగీకరించారని షాపు యజమాని తెలిపాడు. స్థానికులు సైతం ఆ భవన్ నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో ముషీరాబాద్ పోలీసులు ఇరువురిని సర్దిచెప్పడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు.

పరారీలో రాగి వీరాచారి : సైమన్

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హెబ్రోన్ చర్చిలో పలు వివాదాలకు మూల కారకుడుగా ఉన్న రాగి వీరాచారి ప్రస్తుతం పరారీలో ఉన్నారని, ఆయన కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు నగరంలో విస్తృతంగా గాలిస్తున్నారని బ్రదర్ ఎం.మాధవరెడ్డి ఆలియాస్ అద్దంకి యిమ్మానుయెల్, బ్రదర్ శాంసన్, బ్రదర్ ముత్తయ్య, బ్రదర్ రేపాక సైమన్ తెలిపారు. సోమవారం గోల్కొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అశ్వాపురం పీఎస్‌లో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలను దొంగిలించారనే ఆరోపణలపై రాగి వీరాచారిపై కేసు నమోదైందని, జిల్లా కోర్టు దోషిగా తేల్చి 9 నెలలపాటు కఠిన కారాగార శిక్ష విధించిందన్నారు. వీరాచారి హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించినప్పటికీ సుప్రీంకోర్టు కూడా కింది కోర్టు తీర్పును సమర్థించిందన్నారు. హెబ్రోన్ చర్చి భక్తుల సమర్పిస్తున్న కానుకలను యదేచ్ఛగా కాజేసి పెట్రోల్ బంకులు, రెడిమిక్స్ కంపెనీ, టింబర్ డిపోలు పెట్టారని ఆరోపించారు.

లక్ష్యసాధనకు పదో తరగతి తొలిమెట్టు

రాంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఆశయాలను సఫలీకృతం చేసుకోవడానికి పదో తరగతి తొలిమెట్టు అని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల జాయింట్ సెక్రటరీ రమణకుమార్ పేర్కొన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల ఆవరణలో పదో తరగతి పాఠశాల విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విఠలాచారి, డైరెక్టర్ విష్ణుప్రియ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణచారి తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం 50 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యకి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌పాత్‌పై అనారోగ్యంతో వ్యక్తి మృతి

బర్కత్‌పుర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కూలి కోసం నగరానికి వచ్చిన వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్‌ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం. ఏపీలో ప్రకాశం జిల్లాకు చెందిన జాన్(50) నగరానికి వచ్చి కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్‌పై ఉంటూ కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తీవ్ర అనారోగ్యానికి గురైన జాన్ ఫుట్‌పాత్‌పై మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.